క్లుప్తంగా

నిందితులను కఠినంగా శిక్షించాలి

కల్వకుర్తి టౌన్: అదనపు కట్నం కోసం వేధించి తన కూతురు మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని బాధిత తల్లిదండ్రులు బీబీ, అబ్దుల్ ఉస్మాన్‌లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గతేడాది డిసెంబర్ 25వ తేదీన పట్టణానికి చెందిన రజియా(30)ను ఆమె భర్త, అత్తమామలు కలిసి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని పేర్కొన్నారు. ఇదే విషయమై జిల్లా ఎస్పీ, స్థానిక డీఎస్పీ, పోలీసులని కలిసి వారికి తగిన ఆధారాలు అందించామని వివరించారు.

స్థల పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహ్మ స్వామి బ్రహోత్సవాలు త్వరలో ప్రారంభంకానున్నాయి. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రథమ చికిత్స నిర్వహించేందుకు కేంద్రాల ఏర్పాటుకు పెంట్లవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. తాగునీటి వసతిపై ఆరా తీశారు. కేంద్రాల ఏర్పాటు స్థలాలను గుర్తించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుగుణంగా బోధించాలి

బిజినేపల్లి: విద్యార్థులకు అనుగుణంగా బోధించాలని పాలెం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వేంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో వంట గదిని, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుపట్టికను తనఖీ చేశారు. ఎఫ్‌ఎల్‌ఎన్ బోధనను అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు వీరేష్, చైతన్య, భాగ్యలక్ష్మి, లావణ్య, సంధ్య ఉన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన శ్రీనిధి ఉద్యోగులు

కందనూలు: హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను శ్రీనిధి ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు నాగపూరి రాములు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనిధి సంస్థలో ఉద్యోగులు అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మహిళా సిబ్బందికి కనీస సౌకర్యాలు లేవని వివరించారు. పే స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన జంగమ్మ మూడు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయతి ఆశాదీప్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో అశోక్, పరశురాములు, మహేష్, శంకర్, నందుయాదవ్, హరీష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలి

కొల్లాపూర్: రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకురావాలని బీజేపీ నాయకుడు బింగి సాయిలు యాదవ్ కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రెండో విడత యూనిట్ల కోసం గొర్రెల కాపరుల నుంచి డిపాజిట్లు సేకరించిందన్నారు. ఇప్పటివరకు జీవాలను పంపిణీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే అర్హులందరికి గొర్రెలను పంపిణీ చేయాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం: వాహనదారులు మోటారు వాహన చట్టాల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మహేందర్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నంబర్‌ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని కోరారు.

రిమాండ్‌కు తరలింపు

నాగర్‌కర్నూల్ క్రైం: కొన్ని రోజుల నుంచి మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మహేందర్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం మండలంలోని తూడుకుర్తి గ్రామానికి చెందిన దాసరి మహేష్, గుంటి కర్ణాకర్‌లు మండలంలోని పెద్దాపూర్, జిల్లాకేంద్రంలో మోటర్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. మోటార్లు చోరీ చేస్తున్న ఇద్దరితోపాటు కొనుగోలు చేస్తున్న ఇద్దరు వ్యాపారులను బుధవారం అదుపులోకి తీసుకున్నాం. నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రధాన కార్యదర్శిగా కబీర్

పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన కబీర్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ నియమించారు. ఈ మేరకు బుధవారం నియామక పత్రం అంజేశారు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

వెల్దండ: గ్రామీణ క్రీడాకారులు ప్రోత్సహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ స్థలాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. క్రీడాకారులు ఆడేందుకు క్రీడాసామగ్రిని సరఫరా చేసింది. అంతాబాగానే ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడామైదానాల్లో కనీసవసతులు లేక క్రీడాకారులు వెనుకంజ వేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. రూ.లక్షల నిధులు వృథా అయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఎలాంటి నిర్వహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగాయి.

మండలానికి 69 మైదానాలు మంజూరు

మండలంలోని 32 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలోని ఆవాస ప్రాంతాలైన మరో 37 క్రీడా ప్రాగంణాలను మంజూరు చేసింది. స్థలాల కొరతతో చాలా గ్రామాల్లో పాఠశాల ఆవరణంలో క్రీడా ప్రాంగణాల బోర్డులను ఏర్పాటు చేసింది. మొత్తం 59 చోట్ల నేమ్‌బోర్డులను ఏర్పాటు చేశారు. మరో 10 ఆవాస ప్రాంతాల్లో స్థలాల నెలకొంది.

క్రీడాసామగ్రి పంపిణీ

క్రీడకారులను అన్ని రంగాల్లో సిద్ధం చేసేందుకు క్రీడాసామగ్రిని సరఫరా చేసింది. క్రికెట్, వాలీబాల్, ఆరు డంబుల్స్, రెండు డిస్కత్రోలు, 75 జతల ఆట వస్తువుల దుస్తులు గత ప్రభుత్వం నుంచి అందాయని అధికారులు పేర్కొన్నారు.



కంటోనిపల్లి పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

బోర్డులకే పరిమితం



తెలంగాణ క్రీడా ప్రాగంణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. గ్రామాలకు దూరంగా మైదానాలను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల పాఠశాలల్లోనే బోర్డులు పెట్టారు. క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేందుకు వీలులేకుండా ఉన్నాయి. క్రీడా సామగ్రి గదుల్లోనే మూలుగుతున్నాయి. అధికారులు స్పందించి క్రీడాకారులను ప్రోత్సహించాలి.

–మల్లేష్, క్రీడాకారుడు, పెద్దాపూర్

వినియోగంలో తీసుకొస్తాం



గ్రామాల్లో క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకొస్తాం. స్థలం కొరత ఉన్నది వాస్తవమే. పాఠశాలల్లో స్థలం ఉండడంతో అక్కడ బోర్డులను ఏర్పాటు చేశాం. అక్కడే క్రీడాకారులకు ఆటవస్తువులను అందుబాటులో ఉంచుతున్నాం. 59 చోట్ల క్రీడా మైదానాలు ఉన్నాయి. త్వరలోనే మరో 10 చోట్లు మైదానాలను ప్రారంభిస్తాం.

–శ్రీనివాసులు, ఎంపీడీఓ, వెల్దండ

గ్రామాల అభివృద్ధికి కృషి



రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఉల్లంపల్లి, వెలుమలపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో వీరజవాన్ యాదయ్య జ్ఞాపకార్థం గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. అదేవిధంగా బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసారు. ఎన్నికలహామీలో భాగంగా ఉల్లంపల్లి, వెలుమలపల్లి గ్రామాల్లో నూతన రేషన్ దుకాణాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని వసతులు కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నిధులు తీసుకొస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ విజయభాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పండిత్ రావు, అల్వాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

'జిల్లాను అభివృద్ధి మార్గంలో నడిపించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా అభివృద్ధికి నలుగురు ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కలిసి కట్టుగా కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ కోరారు. బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలన ప్రజలకు వ్యతిరేకంగా కొనసాగిందని, అది గమనించిన ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించారని అన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయం సాధించడం ఎంతో అభినందదాయకమన్నారు. ఈ నెల 12న సాయి గార్డెన్‌లో నిర్వహించే అభినందన సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎక్సైజ్ ప్రొహిబిషన్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డిల అభినందన సభకు హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, మారేడు శివశంకర్, గోపిచారి తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలతో మానసికోల్లాసం

కల్వకుర్తి: వనభోజనాలతో మానసికోల్లాసం కలుగుతుందని ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమానికి కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషిణి, ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోలు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో గతంలో కంటే ఆక్యుపెన్సీ శాతం పెరిగిందన్నారు. వనభోజనాలలో భాగంగా ఆర్‌ఎం ఉద్యోగులతో కలిసి ఆటలలో పాల్గొన్నారు. అనంతరం



వనభోజనాలలో పాల్గొన్న ఆర్‌ఎం

వనభోజనాలలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఆమె బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపో సీఐ శ్వేత, ఎంఎఫ్ సురేందర్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల పరిశీలన



అమ్రాబాద్: మండలంలోని తిర్మలాపూర్(బీకే), ఉప్పునుంతల(బీకే), జంగంరెడ్డిపల్లి, చింతలోనిపల్లి ప్రాథమిక పాఠశాలలను బుధవారం తొలిమెట్టు మండల నోడల్ అధికారి సిద్ధార్థ సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానికులకే ఎంపీ టికెట్ కేటాయించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: పార్లమెంట్ స్థానాన్ని స్థానికులకు కేటాయించాలని బుధవారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షీకి కాంగ్రెస్ నాయకుడు మాణిక్యాల చెన్నయ్య బుధవారం వినతిపత్రం అందజేశారు. తాను నాగర్‌కర్నూల్‌లో వైద్యుడిగా ఉంటూ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్నానని వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ తనకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేకు వినతి



చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి నియోజకవర్గ అధ్యక్షుడు రాములు యాదవ్, తండా చెందిన యువకులు బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిశారు. గ్రామం నుంచి తండాకు అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు నిర్మించారని వెంటనే రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వంగూరు గేట్ నుంచి జూపల్లి వరకు బీటీ రోడ్డును మంజూరు చేయాలని విన్నవించారు. కేఎల్‌ఐ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు కొంత మంది రైతులకు నష్ట పరిహారం పెండింగ్‌లో ఉందని వారికి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

వెల్దండ: గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి అజిలాపూర్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అజిలాపూర్ గేట్‌ను బైరాపూర్ వరకు బీటీరోడ్డు నిర్మించాలని విన్నవించారు. కాంగ్రెస్ నాయకులు రమేష్‌గౌడ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

శ్రీరామ అక్షతల పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో రామజన్మభూమి ట్రస్టు సభ్యులు అయోధ్య శ్రీరాముల దివ్య అక్షతలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. ఈ నెల 22న రాత్రి ఇంటి ముందు 5 దీపాలు వెలిగించాలని విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో శారద, కవిత, సంధ్య, శోభ, కరుణ, గీత పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో 10వ రోజు బుధవారం అయోధ్య రాముడి అక్షతలను పంపిణీ చేశారు. రామ భక్తులు ఇంటింటికి ఊరేగింపుగా వెళ్లారు. గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఉమాపతి ఆచార్యులు, శ్రీరాములు గౌడ్, రామకృష్ణ, చిన్న బాబు, సురేష్, చెన్నకేశవులు, చంద్రమౌళి, ఉమాపతి ఆచార్యులు, రవికుమార్ పాల్గొన్నారు.



తెలకపల్లిలో అక్షతలను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

కొనసాగుతున్న దరఖాస్తుల నమోదు

తాడూరు: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నామని ఎంపీఓ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం కార్యాలయ ఆవరణలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతర వివిధ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందితో ఎమ్మార్సీ భవనంలో కూడా కంప్యూటర్లను ఏర్పాటు చేసి నమోదు చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో మండల కేంద్రంతో పాటు 24 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన 14267 దరఖాస్తులను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వెల్దండ: ఫర్టిలైజర్ దుకాణాదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ మంజుల హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు అజిలాపూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దుకాణ యజమానులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు, షాపుల యాజమానులు ఉన్నారు.

నల్లబెల్లం స్వాధీనం

లింగాల: అక్రమంగా రవాణా చేస్తున్న తొమ్మిది క్వింటాళ్ల నల్లబెల్లాన్ని మంగళవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండానికి చెందిన భాస్కర్ బొలెరో వాహనంలో లింగాలకు నల్లబెల్లం తరలిస్తున్నాడు. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా 30 బస్తాల బెల్లం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. బెల్లంతో పాటు వాహనం మరో వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడు భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

డయాలసిస్ ఏర్పాటుపై హర్షం

మన్ననూర్: మన్ననూర్‌లో డయాలసిస్ కేంద్రం, అచ్చంపేటలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వెంకటరమణ, మండల కోఆప్షన్ సభ్యుడు రహీం హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

16న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన అంతర్రాష్ట్ర న్యూక్యాటగిరి విభాగం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు సొంట ఎల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం ఎన్నిమిది స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామని వివరించారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతారని ఆయన తెలిపారు. వివరాలకు సెల్: 9704352168, 98484 83711 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

తాడూరు: మండల కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించే అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా బుధవారం మైదనాన్ని చదును చేశారు. మొత్తం 12 జట్ల వృషభరాజాలు పాల్గొంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.80వేలు, 2వ బహుమతి రూ.70వేలు, 3వ బహుమతి రూ.60 వేలు అదేవిధంగా వరుసగా ఎన్నిమిది స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పట్టణ అధ్యక్షుడిగా ఖాజా

అచ్చంపేట రూరల్: భవన నిర్మాణ తాపీ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడిగా మీనుగ ఖాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఖాజా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం ఒకటో వార్డు కౌన్సిలర్ గౌరీశంకర్, వార్డు ప్రజలు ఖాజాను సన్మానించారు. కార్యక్రమంలో మహేష్‌చారి, లక్ష్మణాచారి, వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



వెల్దండ: విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి వెంకటరణ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలన్నారు. 100 శాతం ఉత్తీర్ణతను సాధించాలన్నారు. విద్యార్థులకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి అధ్యాపకులకు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, సిబ్బంది విజయలక్ష్మి, శివప్రసాద్, ప్రవీణ, షన్ముకరెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు



వెల్దండలో వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దండ: కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు చేకూరుతుందని ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు ఆయనను సన్మానించారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషిచేసిన ప్రతి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, పుల్లయ్య, ఎర్రశ్రీనుముదిరాజ్, తదితరులు ఉన్నారు.

పాత పింఛన్ అమలు చేయాలి

కల్వకుర్తిరూరల్: పాత పింఛన్ అమలు చేయాలని కోరుతూ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి సీడబ్ల్యూయూసీ ప్రత్యేక ఆహ్వానితుడు మాజీ ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డికి బుధవారం సీపీఎస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు విన్నవించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అదేవిధంగా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు సైదులు, రాజేందర్, పర్వతాలు, వేణు, వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, ఫిరోజ్, ఆనంద్ పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఐక్యతా ఫౌండేషన్ సమకూర్చిన స్కాన్ అండ్ లెర్నింగ్ పుస్తకాలను ఉచితంగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను ఇంటి వద్ద చదువుకునేందుకు వీలుగా పుస్తకంపై ఉన్న కోడ్‌ను స్కాన్ చేస్తే పాఠ్యాంశం మీకు ఫోన్‌లో వస్తుందన్నారు. స్మార్ట్ ఫోన్ ద్వారానే విద్యార్థులకు వారు చదువుకోవాల్సిన పాఠాలను ఎన్నిసార్లు అయినా వినవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు

వెల్దండ: మండలంలోని కొట్ర ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ సర్కిల్ పాఠ్యా పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, పాఠశాల చైర్మన్ జంగయ్య, ఉపాధ్యాయులు రామారావు, అల్లాజీ, సద్దాం, మల్లేష్, లక్ష్మయ్య, అల్లాజీ, ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఆధార్ నమోదుకు చెంచుల అవస్థలు



మన్ననూర్: చెంచుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం వద్దకు వచ్చిన చెంచులు రాత్రింబవళ్లు పడరాని తిప్పలు పడుతున్నారు. అమ్రాబాద్, లింగాల మండలంలోని లోతట్టు గ్రామాలు, చెంచు పెంటలకు చెందిన చెంచులు తమ చిన్నారులతో పాటూ సుమారు 500 మంది ఆధార్ నమోదు చేయించుకునేందుకు స్థానిక రైతువేదిక వద్దకు వచ్చారు. నాలుగు రోజుల నుంచి ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతున్నప్పటికి సర్వర్ బిజీ కారణంగా రోజుకు సుమారు 40 నుంచి 50 మంది వరకు మాత్రమే ఆధార్ నమోదు చేస్తున్నారు. దీంతో చెంచులు రోజుల తరబడి అక్కడే ఉంటుండటంతో ఆకలికి తట్టుకోలేక తల్లడిల్లు పోతున్నారు. చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెంచులు వాపోయారు. గ్రామాలకు రవాణా సౌకర్యం లేక పోవడంతో ఆధార్ కేంద్రం వద్దనే పడిగాపులు కాస్తున్నామని చెంచులు ఆవేదన వ్యక్తం చేశారు.

12న వాలీబాల్ పోటీలు

వీపనగండ్ల: సంక్రాంతి పండగ సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 12వ తేదీ నుంచి సంగినేనిపల్లిలో ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేష్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, 2వ బహుమతిగా రూ.5,016 అందజేస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

ఐక్యతతోనే హక్కుల సాధన



వెల్దండ: ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మల్లేషముదిరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో మండల స్థాయి ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు కావల్సిన హక్కుల కోసం పోరాడుదామన్నారు. జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి ప్రమాద బీమా, సబ్సిడీలో వాహనాలు, సంఘ భవనాలను మంజూరు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా మత్స్యకార డైరెక్టర్ కాసారపు వెంకటయ్యముదిరాజ్‌ను మండల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. శేఖర్, బాల్‌రాజ్, లింగంముదిరాజ్, మల్లయ్య, చంద్రయ్య, గణేష్, కృష్ణయ్య, లక్ష్మయ్య, ఉపసర్పంచ్ నర్సింహ్మముదిరాజ్, ఎర్రశ్రీనుముదిరాజ్, శ్రీశైలం, దేవేందర్, శ్రీను, యాదయ్య, లాలయ్య, శంకర్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్ వాసికి అచీవ్‌మెంట్ అవార్డు

కొల్లాపూర్: పట్టణానికి చెందిన వలిపె రాంగోపాల్ రావు బుధవారం కలకత్తాలో వీఎల్‌ఎస్‌ఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. కలకత్తాలో నిర్వహించిన వీఎల్‌ఎస్‌ఐ 37వ అంతర్జాతీయ సదస్సులో ఆయన అవార్డు స్వీకరించారు. ఈసదర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలను అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.